క్లుప్తంగా

ఘనంగా నూకాంబిక కాకతాంబ ఆలయ ప్రారంభోత్సవం



విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కె.కోటపాడు : సింగన్నదొరపాలెం గ్రామంలో నూతనంగా నిర్మాణం జరిపిన నూకాంబికా కాకతాంబ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి యాగశాలలో వేద మంత్రోచ్చారణల నడుమ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. నూకాంబికా కాకతాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు సింగన్నదొరపాలెంతో పాటు దాలివలస, రామచంద్రపురం, సూర్రెడ్డిపాలెం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. శ్రీరావాలమ్మ తల్లి యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.50వేల విలువైన ఇనుము విరాళం



రామాలయానికి ఇనుము అందించిన అర్జునరావు

బుచ్చెయ్యపేట : మండలంలో గల తురకలపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న రామాలయంకు రూ.50 వేలు విలువ చేసే ఇనుమును భక్తులు విస్సారపు అర్జునరావు ఉచితంగా అందించారు. గ్రామంలో ఉన్న రామాలయం శిథిలావస్థకు చేరింది. గ్రామస్తులంతా కలిసి శిథిలమైన రామాలయాన్ని తొలగించి కొత్తగా రామాలయం నిర్మాణం చేపట్టారు. రామాలయం శ్లాబుకు అవసరమైన ఇనుమును అర్జునరావు తన సొంత నిధులతో కొనుగోలు చేసి అందించడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

రాజుపాలెంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



రాజుపాలెంలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల రాజుపాలెం గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఆంజనేయస్వామితో పాటు వినాయక, లక్ష్మీదేవి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సన్నాయిమేళాలు, బారీ బాణసంచా, కోలాటాలు, హరిభజనల నడుమ విగ్రహాలను ఊరేగించి ప్రత్యేక పూజలు చేసి విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన చేశారు.

వైస్ ఎంపీపీ శ్రీనివాసరావుకు పితృవియోగం



వైస్ ఎంపీపీ శ్రీనివాసరావును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్ : మాడుగుల మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరావు తండ్రి అచ్చిబాబు అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. సమాచారాన్ని తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వీరవిల్లి అగ్రహారంలో అచ్చిబాబు భౌతికకాయాన్ని దర్శించుకొని నివాళులు అర్పించారు. అనంతరం వైస్ ఎంపీపీ శ్రీనివాసరావును పరామర్శించి ఓదార్చారు. వైస్ ఎంపీపీని పరామర్శించిన వారిలో దేవరాపల్లి వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బూరె బాబూరావు, కాళ్ల రాము, సయ్యపురెడ్డి నారాయణరావు, రాజుతాత, అచ్చింనాయుడు, జోగారావు ఉన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ

చోడవరం రూరల్: మండలస్థాయిలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై గురువారం ఒక రోజు మండల విద్యాశాఖ జి.జె.సింగ్ ఆధ్వర్యంలో చోడవరంలో నిర్వహించారు.

నాణ్యమైన ఆహారం తయారీ, ఆహార సరఫరా, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణనుద్దేశించి గవరవరం బయాలజీ అసిస్టెంటు కృపామేడం మాట్లాడారు. మండలంలో గల అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన తయారీ నిర్వాహకులు పాల్గొన్నారు.



పల్లాకు తెగులు సోకిన పంట భాగం



రోలుగుంటలో తెగులు సోకిన పెసరపంట

పల్లాకు తెగులు.. అపరాల రైతుకు దిగులు

• పంట దిగుబడులపై ప్రభావం • నివారణకు శాస్త్రవేత్తల సూచనలు

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో రైతులు ప్రతి ఏడాది మాదిరిగానే అపరాల సాగు చేపట్టారు. మెరక పల్లపు భూముల్లో కూడా మినుము, పెసర తదితర పంటలు మండలంలో గల అన్ని గ్రామాల్లోను సాగు చేశారు. వాతావరణం కూడా కలసి రావడంతో పంటలు పచ్చగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొమరవోలు, రోలుగుంట, కొవ్వూరు, కె.నాయుడుపాలెం తదితర గ్రామాల్లో ఈ పంటలకు పల్లాకు తెగులు సోకినట్టు రైతులు చెబుతున్నారు. తెగులు సోకిన పైరు పసుపు వర్ణంలో మారిపోయి, ఆకులకు రంధ్రాలు పడుతుంది. ఈ తెగులు సోకితే పంట దిగుబడులు రావని తమ కాయకష్టం బూడిదైనట్టేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.పంట పండితే ఎకరాకు ఆరు, ఏడు బస్తాలు దిగుబడులు వస్తాయని ఆశించిన రైతులకు తెగులు సోకడంతో మూడు బస్తాలు కూడా రావడం కష్టమే అంటున్నారు.

ఎకరాకు రూ.15వేల ఖర్చు

ఈ ఏడాది ఈ పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేయడంతో పాటు పెట్టుబడులు కూడా అధికంగానే పెట్టారు. కౌలు దారులైతే ఎకరాకు ఎనిమిది నుంచి రూ.10వేల వరకూ కౌలు చెల్లించాల్సి ఉంటుంది. దుక్కులు, విత్తనాల పురుగు మందులు, పిచికారికి ఇప్పటికే రూ.8వేల వరకూ ఖర్చు చేశామంటున్నారు. మొత్తం ఎకరాకు రూ.15 వేలు వరకూ పెట్టుబడి అయిందని తెలిపారు.

ఇవీ తెగులు లక్షణాలు

ఈ తెగులు సోకితే మొక్క పసుపు రంగులోకి మారిపోతుంది. కాయల ఉత్పత్తి కూడా ఉండదు. ఒకవేళ కాసినా లోపల గింజలు పెద్దగా ఉండవు, చచ్చుబడి ఉంటాయి. మారిన వాతావరణ పరిస్థితుల వల్ల వైరస్ విజృంభిస్తుంది.

దిగుబడి తగ్గే అవకాశం



తెగులు సోకడంతో ఈ ఏడాది సగం పంట కూడా దక్కే పరిస్థితి లేదు. ఎకరాకు ఎనిమిది బస్తాలు పైగా వస్తుందని ఆశించాం. ఈ మేరకు సాగు చేశాం. ప్రస్తుతం తెగులు దెబ్బకు సగం పంట కూడా చేతికందే పరిస్థితి కనిపించడం లేదు.

– తమరాన శ్రీను, రైతు, రోలుగుంట

జాగ్రత్తలు పాటించాలి



పెసరకు పల్లాకు తెగులు సోకితే పంట పూర్తిగా దెబ్బ తింటుంది. దిగుబడి దారుణంగా పడిపోతుంది. ఈ తెగులు నివారణకు విత్తన శుద్ధి ఒక్కటే మార్గం. అందుకు ఇమిడోక్లోపిడ్ 5 మిల్లీ లీటర్లను కిలో విత్తనాలు పట్టించాలి. అలాగే సాగు చేసిన పైరులో పసుపు వర్ణానికి చెందిన మొక్కలను వెంటనే పీకేసి దూరప్రాంతాలకు తీసుకెళ్లి గొయ్యి తీసి కప్పేయాలి.

– ఎస్.విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి, రోలుగుంట

పర్యావరణ పరిరక్షణ ర్యాలీ



మొక్క నాటుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి



గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

నర్సీపట్నం : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సీపట్నం మండలం, యరకన్నపాలెం గ్రామంలో ఎస్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, సర్పంచ్ నారాయణమ్మ, వైస్‌సర్పంచ్ సుర్ల చంద్రశేఖర్ పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలను సంరక్షిస్తామని ఉపాధి కూలీలు, పంచాయతీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. నర్సీపట్నం గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డీజీ నాథ్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం పలు పాఠశాలల్లో మొక్కలు నాటారు. క్లబ్ ప్రతినిధులు అప్పారావు, ప్రసాద్, బాబీ మాస్టారు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తురకబడిలో హెచ్ఎం వెంకట రమణ, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు.

అంగరంగ వైభవంగా గండిమారమ్మ జాతర

25 ఏళ్ల తర్వాత భారీ స్థాయిలో పండగ నిర్వహణ



గండిమారమ్మ సన్నిధిలో మాజీ డిప్యూటీ సీఎం బూడి తదితరులు



పెదగోగాడలో అమ్మవారిని దర్శించుకుంటున్న బూడి

దేవరాపల్లి : నాగయ్యపేటలో గండిమారమ్మ అమ్మవారి పండగ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. సుమారు 25 సంవత్సరాల తర్వాత నిర్వహించిన పండుగ సందర్భంగా గురువారం అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబురావు, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గోవింద, వంటాకు శ్రీను, శంభు నాయుడు, సన్యాసినాయుడు ఉన్నారు.

కనకమ్మవారిని దర్శించుకున్న బూడి

చీడికాడ : పెదగోగాడలో గల కనకమహాలక్ష్మి అమ్మవారి పండగ సందర్భంగా బుధవారం మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ పైల అచ్చియ్యమ్మ, ఉప సర్పంచ్ బూసాల పార్వతి బూడిని దుశ్శాలువాలతో సత్కరించారు.

ఆస్తి పన్ను సర్వేను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు అడిగర్ల రాజు

నర్సీపట్నం : మున్సిపాలిటీలో ప్రాపర్టీ ట్యాక్స్(ఆస్తి పన్ను) సర్వేను మున్సిపల్ అధికారులు తక్షణమే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పట్టణ సంస్కరణలో భాగంగా మున్సిపాలిటీలో ఆస్తి ఆధారిత పన్నులు విధించేందుకు ఇళ్లు, ఇళ్ల స్థలాల సర్వే చేపట్టారన్నారు. దీనిని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. మున్సిపాలిటీలో 10 వేల కుటుంబాలు ఉన్నాయని, అధిక భాగం రోజువారి కూలీలు, మధ్యతరగతి ఉద్యోగులు ఈ పన్నుల భారంతో ఇంటి అద్దెలు పెరిగి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో పక్కన కరెంటు ఛార్జీలు, నిత్యవసర ధరలు విపరీతంగా పెంచుతున్నారన్నారు. పాలకవర్గంలో చర్చించిన తరువాతే ఏ నిర్ణయమైనా తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చిరంజీవి, సాపిరెడ్డి నారాయణమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు : మండలంలో గొందుపాలెం ఫీడర్ పరిధిలో గల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. చౌడువాడలో నిర్మాణం జరుపుకొంటున్న సబ్‌స్టేషన్‌లో చేపడుతున్న పనుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ నిలిపివేయనున్నట్టు తెలిపారు. చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల పరిధిలో వినియోగదారులు దీనిని గమనించి సహకరించాలని కోరారు.

రోలుగుంట : మండలంలో శరభవరం, కొమరవోలు ఫీడర్ నుంచి 11 కేవీ నుంచి సర ఫరా అవుతున్న గ్రామాల్లో శుక్రవారం లైన్ మెయింటెనెన్సు పనుల కారణంగా విద్యుత్‌కోత ఉంటుందని విద్యుత్‌శాఖ నర్సీపట్నం డివిజన్ ఈఈ ఏపీఎస్ఎం అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కుసర్లపూడి, రొంగలపాలెం, జేపీ అగ్రహారం, సుబ్బారాయుడుపాలెం, నర్సీపట్నం మండలం పరిసర గ్రామాల్లోను, కొమరవోలు ఫీడర్ నుంచి కొండపాలెం, పడాలపాలెం, రోలుగుంట మండలం పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

కుక్ కమ్ హెల్పర్స్‌కు ఒకరోజు శిక్షణ

రోలుగుంట : మధ్యాహ్న భోజన పథకం అమలు కోసం గురువారం మండలస్థాయిలో కుక్‌లకు, హెల్పర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో-జానుప్రసాద్, ఎంఈవో-2 పి.జగ్గారావు ప్రారంభించారు. శిక్షణ నుద్దేశించి ఎంఈవో-2 జగ్గారావు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బడికి వస్తున్న విద్యార్థులకు రుచిశుచిగల ఆహారం అందించడంలో కుక్‌లు, హెల్పర్లు ప్రధానపాత్ర వహించాలన్నారు. విద్యార్థుల శారీరక అభివృద్ధి ప్రభుత్వం నిర్దేశించి రూపొందించిన మెనూ చార్టును విధిగా పాటించాలన్నారు. పథకం అమలు, విధులపై వారికి రోలుగుంట కాంప్లెక్సు హెచ్ఎం శేషగిరి శిక్షణ ఇచ్చారు.

వెలుగు వీఓఏలకు యోగా శిక్షణ



వెలుగు కార్యాలయంలో యోగా శిక్షణలో పాల్గొన్న వీవోఏలు

మాడుగుల: స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వెలుగు కార్యాలయంలో వీవోఏలకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కొంకి అప్పారావు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేజేపురం వెంకన్న కల్యాణోత్సవాలకు అంకురార్పణ



కె.జె.పురం జంక్షన్‌లో స్వామి వారి ఆలయంలోకి పుట్టమట్టిని తీసుకొస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 15 వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా, గురువారం అంకురార్పణ, విశ్వక్సేనపూజ, ఆనంతరం ఆలయం సమీపం నుంచి పుట్టమట్టి తెచ్చారు. స్వామి వారి కల్యాణం శుక్రవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేట రామకొండలరావు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారి ఆలయంలో భజన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

దేవరాపల్లిలో ఈదురుగాలుల బీభత్సం



విరిగిపడ్డ కొమ్మలను తొలగింప చేస్తున్న ఎస్ఐ మల్లేశ్వరరావు



రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్న సిబ్బంది

దేవరాపల్లి : మండల వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం బలమైన ఈదురులు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండల కేంద్రం దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న విద్యుత్ వైర్లపై రెండు భారీ చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో రెండు విద్యుత్ స్తంభాలు రోడ్డుపై కూలాయి. ఆ సమయంలో వాహనాలు, ప్రయాణికులు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా ప్రధాన రహదారిలో సుమారు గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు దగ్గరుండి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు కొమ్మలను తొలగింప చేశారు. వర్షం కారణంగా దేవరాపల్లిలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి రాత్రి 7:45 గంటల సమయంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ఘనంగా వనమహోత్సవం



బుచ్చెయ్యపేటలో మొక్కలు నాటుతున్న అధికారులు



మర్రిపాలెంలో మొక్కలు వేస్తున్న ప్రజాప్రతినిధులు అధికారులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల పలు గ్రామాల్లో అధికారులు, పలు పార్టీల నాయకులు మొక్కలు నాటారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుచ్చెయ్యపేట, వడ్డాది, రాజాం, కొండపాలెం, గున్నెంపూడి, సీతయ్యపేట, దిబ్బిడి, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే రాజు, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీవో వరహాలబాబు తదితరులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని అలవర్చుకోవాలని దిబ్బిడిలో ఎమ్మెల్యే రాజు తెలిపారు.

మొక్కలు నాటిన న్యాయమూర్తి

నర్సీపట్నం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు సముదాయంలో గురువారం జూనియర్ సివిల్ జడ్జి రోహిత, కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శుభకార్యాల జరుపుకొన్నప్పుడు కార్యక్రమం పేరు మీద మొక్క నాటితే పర్యావరణానికి మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు మాకిరెడ్డి బుల్లిదొర తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతిమొక్కను సంరక్షించాలి

నాతవరం : నాటిన ప్రతి మొక్కను పెంచినప్పుడే ఆశయం నెరవేరుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు మంకు సాంబమూర్తి అన్నారు. మర్రిపాలెం పంచాయతీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పాఠశాల చెత్త సంపత తయారీ కేంద్రం చెరువు గట్లపై మొక్కలు నాటారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలో వివిధ జాతులు మొక్కలు నాటారు. ఉపాధి ఏపీవో దాసరి కొండాజీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 5 వేల మొక్కలు నాటడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ ప్రాజెక్టు చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు, విజయకుమార్ , కొండబాబు పాల్గొన్నారు.

గొలుగొండ: ప్రతీ గ్రామం, ఇంటి వద్ద మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కృష్ణదేవిపేట అటవీశాఖ రేంజర్ కె.శ్రీనివాసరావు, గొలుగొండ ఎస్ఐ రామారావు, ఎంపీడీవో మేరీరోజ్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గొలుగొండ గురుకుల కళాశాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వర్రావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : వాతావరణ పరిస్థితుల సమతుల్యతకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం ఆవశ్యతను గుర్తించాలని రాజమండ్రి నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. గురువారం కె.కోటపాడు అయ్యన్న కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ సత్యనారాయణ మూర్తి, అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, నూర్జహాన్ పాల్గొన్నారు.

రోలుగుంట : విరివిగా మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపులో భాగస్వాములు కావాలని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచ్ కొప్పుల వరలక్ష్మితో కలసి ప్రారంభించారు. హెచ్ఎం శేషగిరి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి, ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంచాడ చంద్ర, ఎంపీటీసీ కృష్ణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : పర్యావరణ పరిరక్షణకు సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబురావు అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఉపాధి హామీ పథకం, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్థానిక గ్రామ పెద్దలతో కలిసి సర్పంచ్ గురువారం మొక్కలు నాటారు.

రావికమతం : మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని సంరక్షించడం అందరి బాధ్యత అని చోడవరం ఎమ్మెల్యే రాజు అన్నారు. రావికమతం మండలం కొత్తకోట, మేడివాడ, టి.అర్జాపురం హైస్కూల్లో, మండల పరిషత్ ఆవరణలో మొక్కలు నాటారు.



కోర్టు సముదాయంలో మొక్కలు నాటుతున్న జూనియర్ సివిల్ జడ్జి రోహిత్



గొలుగొండ గురుకుల కళాశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం



కె.కోటపాడులో మొక్కలను నాటుతున్న రిటైర్డ్ వీసీ ముత్యాలనాయుడు



రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రాజు, ఉపాధ్యాయులు



బోయిలకింతాడలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ బూరె బాబూరావు

చీడికాడ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం వన మహోత్సవంలో భాగంగా చీడికాడ ఉన్నత పాఠశాలలో ఆయన మొక్కలు నాటారు. ఉపాధి సిబ్బంది,అటవీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి వనాలను పెంచాలన్నారు.

కుక్, చౌకీదారు పోస్టులకు దరఖాస్తులు

కె.కోటపాడు : 2025-26 విద్యాసంవత్సరంలో కె.కోటపాడులో గల టైప్-4 కేజీబీవీ పాఠశాలలో పని చేసేందుకు ఆసక్తి గల వారి నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ తెలిపారు. హెడ్ కుక్, అసిస్టెంట్ హెడ్ కుక్ పోస్టులతో పాటు చౌకీదార్ పోస్టులకు ఈ నెల 10లోగా స్థానిక ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని ఆయన కోరారు. హెడ్‌కుక్, అసిస్టెంట్ హెడ్ కుక్ పోస్టులకు విద్యార్హత ఏమీలేదని, చౌకీదార్ పోస్టుకు 1 నుండి 7వ తరగతి వరకూ పాస్ అయిన సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో జతపర్చాలని ఆయన సూచించారు. దరఖాస్తుదారులు ఈ ఏడాది జూలై 1 నాటికి 45 ఏళ్లు మించరాదని, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి 47 ఏళ్ళ వయస్సు ఉండవచ్చునని ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. ఈ పోస్టులను రోజువారి వేతన ప్రక్రియలో భాగంగా నియామకం చేయనున్నట్లు వివరించారు.

ఫ్రైడే డ్రైడేగా పాటించాలి

కె.కోటపాడు : మలేరియా వ్యాధి ప్రధానంగా దోమకాటు ద్వారానే సోకుతుందని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శశి ప్రియాంక అన్నారు. మలేరియా మాసోత్సవం సందర్భంగా ఎ.కోడూరులో గురువారం ఆమె వైద్య సిబ్బందితో కలిసి దోమలు వృద్ధి చెందకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన ర్యాలీని జరిపారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలను ఎక్కువ రోజుల పాటు కొలది ఉంచకూడదన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలని తెలిపారు. ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించి మురుగునీటిని తొలగించే చర్యలను ప్రజలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, టీబీ సూపర్‌వైజర్ నాయుడు, హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఏఎన్ఎం లక్ష్మి, సంతోషి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థుల జాబితా

నర్సీపట్నం : నర్సీపట్నం మండలం, వేములపూడి ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి ఎంపికై న విద్యార్థుల జాబితాను పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించామని ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం ఈ నెల 12న పాఠశాలకు వచ్చి అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ సూచించారు.